అందరి
జీవితాలకీ
ముగింపు
ఇదే అయితే?

పి.వి.డి.ఎస్.
ప్రకాష్

కథ

# చరమగీతం

‘‘శంకరం మాస్టారు పోయారుట’’ వీధిలోంచి వస్తున్న ఆనందరావు చెప్పాడు భార్యతో.

‘‘అయ్యో! పాపం. ఎంత వయసేమిటి’’ అడిగింది సౌజన్య.

‘‘అరవయ్యేళ్లుంటాయి. రెండేళ్ళ కిందటే కదా రిటైరయింది’’ అన్నాడతడు.

మళ్ళీ అన్నాడతడే – ‘‘అతడు నెరవేర్చవలసిన బాధ్యతలు ఇంకా ఉన్నాయి. పెద్ద కూతురు పెళ్ళి చేసాడంతే. ఇద్దరాడపిల్లలున్నారు పెళ్ళికెదిగి. కొడుక్కి ఏ ఉద్యోగమూ రాలేదాయె’’ చెబుతున్నాడతడు.

‘‘చాల్లెండి సంబడం. ఎవ్వాళ్ళు ఉట్టికట్టుకొని ఊరేగుతారు మీనాన్నగారితో. ఏదో పుట్టినందుకు తనవంతు కర్తవ్యాన్ని నెరవేర్చి వెళ్లిపోయాడా మహానుభావుడు. కాలూ చేయీ సక్రమంగా ఉండగానే టపీమని చచ్చి ఊరుకొన్నాడు’’ ఆమె మాటలకు అడ్డొచ్చాడు ఆనందరావు.

‘‘ఉష్! నెమ్మదిగా మాట్లాడు. పక్కగదిలోనే నాన్న ఉన్నాడు.’’

‘‘ఉంటే భయమేమిటి? అతనికింకా బతకాలని ఆశ ఉన్నా ఆయనకు సేవ చేయలేక ఛస్తున్నా నేను. కాళ్ళు చేతులు పడిపోయి అన్నీ మంచంమీదనే చేసుకొనే ఆ బతుకు ఓ బతుకేనా? ఛస్తే నయం కాదూ’’ ఆనందరావు ఏం మాట్లాడలేదు. నేరకపోయి ఈ విషయం కదిపానని అనుకొన్నాడంతే.

నిజానికి ఆనందరావుకి తండ్రిమీద ప్రేమతో కాదు భార్యని అభ్యంతరపెట్టింది



అతనికి విసుగ్గానే ఉంది. అలా ఓ దిష్టిబొమ్మలా మంచానికి అతుక్కొని ఉన్న తండ్రిని చూస్తుంటే. పిల్లలొకపక్క ఎదిగి వస్తున్నారు. అందులో ఆడపిల్లలాయే. వారి చదువులు, పెళ్ళిళ్ళు అన్నీ డబ్బులో కూడుకొన్న సమస్యలే. వీటికి తోడు ఈ ముసలోడు చావకుండా సాధించుకు తింటున్నాడు మందులని మాకులని.

వచ్చే జీతం సరిపోక అప్పొసొప్పో చేయా ల్సి వస్తోంది ప్రతినెల చివరిలో.

"ఇంకా మందులెందుకు నాన్నా! అవేవీ పనిచేయవు" అంటే ఆ ముసలోడు మందగిం చిన చూపులతోనే ఎర్రగా చూస్తాడు.

ఎప్పుడు చస్తాడా ఎప్పుడు వాకిట్లోకి ఈడ్చేద్దామా అని చూస్తుంటే ఆ సంతోష ఘడియ రావడం లేదు కూడాను.

అయితే

భార్యలా మరీ అంత నిర్మొహమాటంగా మాట్లాడలేదు కదా తను.

ఎంతయినా కన్న కొడుకు.

ఇంకా భార్య ఏదో సాధిస్తూనే ఉంది — "ఈ మధ్యాహ్నం మంచంలోనే ఆ రెండూ చేసాడు. దుప్పట్లన్నీ పాడు — పాడు దుప్పట్లంటే చస్తాననే భయం లేకుండా ముక్కు మూసుకునైనా ఉతుకుతాను. పిల్ల లున్న ఇల్లాయే. ఈగలువాలి ఏ కలరా అయినా వస్తేనో?"

"పోనిద్దూ! పెద్దరికం" అన్నాడు ఆనం దరావు. అంతే సౌజన్య మళ్ళీ దండకం ప్రారంభించింది. ఇక అక్కడ ఉండలేక ఆనందరావు బయటకు నడిచాడు — అలా శంకరం మాస్టారి కుటుంబాన్ని పరామర్శిం చి వస్తానంటూ.

"వెళ్ళండి. ఆ చావేదో ఈ ఇంటికి వచ్చినా బాగుణ్ణు. ఓ శని విరగడవును" అంది సౌజన్య.

ఈ మాటలు వింటున్న పరంధామయ్య సిగ్గుతో చచ్చిపోయాడు.

"హే భగవాన్! నాకు చావెపుడు తండ్రీ. త్వరగా తీసుకుపోవూ" మనసులోనే వేడుకొ న్నాడు కనిపించని ఆ సృష్టికర్తని.

ఇంతలో ఆ గదిలోకి వచ్చింది సౌజన్య.

"ఇదిగో ఇది విన్నారా? శంకరం మాస్టా రు పోయారుట"

"విన్నాను" నెమ్మదిగా అన్నాడు పరం ధామయ్య.

"అతను మీకంటే ఎన్నేళ్ళు చిన్న?" మనసులోనే ఏవో కూడికలు వేసుకొని

క్షణం తర్వాత నోరు విప్పాడు పరంధామ య్య.

"రెండు దశాబ్దాలు"

"అంటే ఇరవయ్యేళ్ళా? అర్థమయ్యేట్లు చెప్పొచ్చు కదా! రెండు దశాబ్దాలుట. రెండు దశాబ్దాలు... ఆ వయసుకే మీరు ఛస్తే ఇరవై ఆర్థికాలు అయి ఉండును కదా?"

గుండెనెవరో ఇనుప పిడికిలితో నలిపి వేస్తున్నట్లు చిన్నగా బాధ.

ఏం మాట్లాడలేదు పరంధామయ్య.

ఏం మాట్లాడగలడు?

తన ఇల్లే పరాయిదయితేనూ.

***

శూన్యంలోకి నిస్తేజంగా చూస్తూ ఆలో చిస్తున్నాడు పరంధామయ్య. శంకరం తనూ ఈ ఊర్లోనే పుట్టి పెరిగారు. ఇక్కడే ఉద్యోగం చేశారు. రిటైరయ్యారు.

తన జీవితంలోకి పరిచయమైన, ప్రవేశిం చిన ఆత్మీయులొక్కొక్కరే మెల్లగా నిష్క్ర మిస్తున్నారు.

చిన్న అర్ధాంగి శారద.

ఈరోజు శంకరం.

బాధగా నిట్టూర్చాడు పరంధామయ్య.

తోటల్లో సీతాకోక చిలుకలు పట్టుకొని ఎగిరి గంతులేసే బాల్యం మటుమాయమైంది. గోలికాయలు, తొక్కుడు బిళ్లల చిరుత ప్రాయం తెరమరుగైంది.

ఈ చరమాంకంలో చిరువామాలేని ఆ బాల్యాన్ని తలుచుకొంటే ఎంతో ఊరట కలుగుతుంది పరంధామయ్యకి.

ఏటిలో స్నానాలు, తోటలో జామకాయల దొంగతనాలు ఒక్కొక్కటి ఒక్కో మధుర స్మృతి.

కోసిన జామకాయ కాకెంగిలి చేసి పక్కింటి శారదకిచ్చేవాడు. చక్రాల్లాంటి కళ్లు తిప్పుకొంటూ జామకాయముక్క ఆ అమ్మాయి తింటుంటే ఎంతో ముచ్చటేసేది పరంధామయ్యకి.

వయసు వసంతం రాగానే శారదలోని పరికిణీ చాటు పరువం నేత్ర పర్వంగా తోచేది పరంధామయ్యకు. ఓరగా చూస్తూనే అంతలో తడబాటుపడుతూ సిగ్గుతో కనురెప్పలు వాల్చేసేదామె. పసిమి ఛాయ.

నవ్వితే ఎన్ని మల్లెలు రాలేవో?

పలికితే సంగీతమే.

నడిస్తే నర్తనే.

నీలాటి రేవుకి వెడుతుంటే ఒంటరిగా చెయ్యిపట్టుకొనేసరికి ఇద్దరి శరీరాల్లో ఏదో ప్రకంపన.

ఒక్కసారి ఇప్పటి తన శరీరాన్ని చూసుకొన్నాడు పరంధామయ్య.

ఆ వయసేది?

ఆ బిగువేది?

ముడతలు దేరిన దేహం. తనమీద తనకే అసహ్యం పుట్టేలా రూపం. శుభ్రంగా స్నానం చేయాలన్నా ఒకరిమీద ఆధారపడాల్సిందే.

అప్పట్లో నీలాటి రేవులోనే సరిగంగ స్నానాలు. తడిసిన చీరల్లో ఆమె మేనివొంపులు మత్తెక్కిస్తుంటే బిగియార కౌగిలించుకొనేవాడు తను.



ఓరోజు తల్లీ తండ్రికి దొరికిపోతే అదో విరహం.

చదువయ్యేదాకా ఇద్దరినీ కలవవద్దని ఆంక్ష.

ఆ నిరీక్షణలో ఎంత వేదనో?

అదెంత మధురమో?

ఇప్పుడ్దో—

నిరీక్షణే.

ప్రేయసి కోసం కాదు

పెన్షన్ కోసం కాదు—

మృత్యు శీతల స్పర్శకోసం. ఇప్పటి ఈ ఎదురుచూపు ఆ దేవత కరుణా కటాక్షాల కోసం.

నవ్వుకొన్నాడు పరంధామయ్య.

ఎలాగో చదువయిందనిపించగానే—

'మాంగళ్యం తంతునా నేనా'

ఇక ప్రతిరోజూ శారదరాత్రే.

శోభన వేందే.

ఏడాది తిరక్కుండానే ఆనందరావు శారద కడుపున పడ్డాడు.

అప్పట్నుంచి బాధ్యతల పర్వం. ఒకరి కోసం ఒకరం అంటూనే అర్థాంగి కనుమరుగైపోయింది.

తలుపు చప్పుడైంది.

ఆలోచనా దారం తెగింది.

"ఏది తప్పినా ఇది తప్పదు కదా! మస్తుగా భోంచేయండి. మజ్జిగ అన్నం పెట్టాను. అరిగి చావదని" సౌజన్య అంటోంది.

ఒక చెయ్యి కాలు పడి కదలలేని స్థితిలో కంచం అందుకొనే శక్తి ఉందా తనకి. శారద గుర్తొచ్చింది పరంధామయ్యకి. ఒకరోజు నలత చేస్తేనే గోరు ముద్దలు తినిపించేంది అతిగారంగా.

"వద్దు... ఆకలి లేదు" అన్నాడు పరంధామయ్య.

"వయసొచ్చినా బుద్ధి పెరగలేదు. ఇంటెడు చాకిరి చేస్తుంటే ఒకసారయినా చిరాకన్పించదా ఏదో మాటంటే అలకొకటి. బుద్ధి జ్ఞానం ఉండాలి" అనేసి వెళ్ళిపోయింది సౌజన్య.

***

"ఏ వృద్ధుల అనాథశరణాలయంలోనే మీనాన్నగార్ని చేర్పించకూడదూ" సౌజన్య అంది.

"వద్దు సౌజన్యా! మనకోసం కాకపోయినా లోకం కోసమైనా ఆ భారం భరించక తప్పదు" అన్నాడు ఆనందరావు.

"ఎన్నాళ్ళిలా?"

"అతనికి చావొచ్చేవరకూ"

"మృత్యువు మరచిన మనిషంటే అతడు. జీవితంలో ఇక చావడు" అందామె కోపంగా.

"జాతస్యహి మరణం ధ్రువం. పండు టాకు రాలకతప్పదు. ఈ శిశిరంలో ఎన్నాళ్ళు బతుకగలను. తప్పకుండా చస్తాను ఏదో ఒక రోజు. ఆ రోజే తెలీక ఈ బాధ మీకూ నాకూ" అనుకొన్నాడు పరంధామయ్య.

"పోనీ! ఆత్మహత్య చేసుకొంటే" మళ్ళీ ఆలోచించాడు — "బలవంతంగా చావడమా ఇంత బతుకూ బతికి"

కళ్ళు మూసుకొన్నాడతడు.

"శారదా! ఎక్కడున్నావ్. నన్ను విడిచి

ఎలా ఉండగలుగుతున్నావ్? నీ దగ్గరకు తీసుకుపోరాదా త్వరగా. చూసావా శారదా! చిన్నతనంలో నీ కడుపులో తంతుంటే ఆనందించాం మనం. మన ఆనందరావే జీవితంలో తంతున్నాడే. ఇప్పుడూ ఆనందించాలి కదా''

***

దగ్గు.

ఊపిరి సలపనంత దగ్గు.

ఈ దెబ్బతోనే ప్రాణంపోతే బాగుండును. ఈ జీవితంపై విసుగు కలుగుతోంది. ఈ లోకం నాదికాదు. ఈ ఇల్లు నాది కాదు. తింటున్న ఈ తిండి, మింగుతున్న ఈ మందులు తనవి కావు.

తను పుట్టినప్పుడున్న సూర్యుడు, చంద్రుడు, ఆకాశం, భూమి, చెట్లు, చేమలు, కొండలు, కోనలు — ఇపుడున్నా అవేవి తనవి కావు.

తన రోజులు గడిచిపోయాయి. ఈ తరం తనది కాదు. పుట్టిన ప్రతివాడూ చావకుండా మిగిలిపోతే ఈ ప్రపంచం కిక్కిరిసిపోతుంది.

మనిషిమీద మనుషులు, మనుషులు. అందుకే వచ్చే తరానికి మనం చోటివ్వాలి.

ఈ సౌందర్య జగతిని వారు ఆస్వాదించి ఆనందించేందుకు అవకాశం ఇవ్వాలి.

ఈ లోకంలోని కన్నీళ్ళు, కష్టాలు వాళ్ళు కూడా అనుభవించేందుకు మనం ఖాళీ చేయాలి,


తను ఖాళీ చేసి వెళ్ళిన ఈ కుక్కిమంచం మీదకు

మరోడు వచ్చేందుకు అవకాశమివ్వాలి.

''మృత్యు దేవతా! కనికరించవా!'' వేడుకొంటున్నాడు పరంధామయ్య.

విపరీతమైన దగ్గు.

''నాన్నా'' ఆనందరావు వచ్చాడు. పక్కనే సౌజన్య కూడా. వాళ్ళ కళ్ళలో తన చితిమంటలు దీపావళిలా వెలుగులీనుతే అంతే చాలు.



## ఓటమి

ప్రముఖ బాక్సర్‌ని ఇంటర్వ్యూ చేస్తున్నాడు విలేకరి.

''మీరు గెలుపు ఓటమిలలో ఏది కోరుకుంటారు'' అడిగాడు.

''ఓటమి''

''ఆశ్చర్యంగా వుందే!''

''అదేనండీ! నా ప్రత్యర్థి ఓటమిని'' తెలివిగా చెప్పాడు బాక్సర్.

—గౌరి శ్రీనివాస్ (తగరపువలస)

"బాబూ!" నెమ్మదిగా అన్నాడు పరంధామయ్య. ఉప్పెనలా వస్తున్న ఆ దగ్గు నాపుకొంటూనే అన్నాడు పరంధామయ్య —

"నే వెళ్ళి పోతున్నా బాబూ! ఏనాడైనా నీకు బాధ కల్గిస్తే ఈ ముసలోడిని మనసారా తిట్టుకో తండ్రి"

సౌజన్య అంటోంది — "డాక్టర్‌ని పిలవండి"

"వద్దమ్మా వద్దు. ఆ డాక్టరొద్దు. ఆ మందులొద్దు. మళ్ళీ ఈ బతుకొద్దు. నాకు విముక్తి కావాలి. ఈ చెరసాలనుంచి నాకు విముక్తి కావాలి" ఆ మాటలంటూనే మగతలోకి వెళ్ళిపోయాడు పరంధామయ్య.

"నిద్రో... దీర్ఘనిద్రో తెలుసుకోడానికైనా డాక్టరు కావాలి కదా వెళ్ళండి" పురమాయించింది సౌజన్య. హడావిడిగా వెళ్ళాడు ఆనందరావు. పది నిముషాల్లో డాక్టర్‌ని వెంటబెట్టుకొని వచ్చాడతడు.

పరంధామయ్యను పరీక్షించి ఆ డాక్టర్ అన్నాడు—

"ప్చ్! వెరీసారీ! ఆయన చనిపోయారు"

"నిజంగానా" అడిగింది సౌజన్య. ఒక్కసారి ఆనందరావుకి విషాదం ముంచుకొచ్చింది. కట్టెలా మారిన పరంధామయ్య శరీరాన్ని తాకి చూసాడు. జీవం లేదు. తెరిచి ఉన్న అతని కనురెప్పలు మూసాడు.

***

తెల్లారింది.

పరంధామయ్యను ఒక్కొక్కరే చూసి వెడుతున్నారు.

అంతిమ సంస్కారానికి అన్నీ సిద్ధం చేశాడు ఆనందరావు.

బయట పాడె కడుతున్నారు కొందరు. బ్రాహ్మణుడొచ్చాడు.

గదిలో సౌజన్య ఏడుస్తోంది. బయట జనానికి వినిపించేలా. బతికుండగా సాధించిన ఆమె మామగారి సుగుణాల్ని అదేనోట పొగుడుతోంది.

ఇంకా పేపట్లో పరంధామయ్య అంతిమ యాత్ర ప్రారంభమవుతుంది.

చివరిసారిగా తండ్రిని చూసేందుకు ఆ గదిలోకి వెళ్ళాడు ఆనందరావు. భర్తను, అనుసరించింది సౌజన్య.

చిత్రం—

పరంధామయ్య చూస్తున్నాడు. నెమ్మదిగా తండ్రి దగ్గరకు చేరాడు ఆనందరావు.

"నాన్నా" పిలిచాడు ఆత్రుతగా.

"ఏం బాబూ!" అడిగాడు పరంధామయ్య.

ఇదే మృత్యు రహస్యం.

ఎవరేం చెప్పగలరు?

ఒక్కసారి ఆనందరావుకి ఆనందం వేసింది తండ్రి బతికున్నందుకు. బయటకు వెళ్ళి ఈ విషయం చెబుదామనుకున్నాడు.

అంతలోనే ఆపింది సౌజన్య.

"ఏమండీ! ఒక్కమాట"

"చెప్పు"

"తండ్రిపోయిన దుఃఖం అనుభవంలోకి వచ్చేసరికి ఆయన బతకడంలో ఆనందం మీకు తెలిసింది. కాని అతను బతకడంవల్ల ప్రతిరోజూ మనమెంత నరకం అనుభవిస్తున్నామో మీకు తెలియంది కాదు"

ఆనందరావు వింటున్నాడు.

"మీ తండ్రి బతుకలేదనుకోండి. రాత్రి విషాదమే నిజమనుకోండి."

"అంటే"

"అంటే ఇలా" గది తలుపులు మూసింది. మెమ్మదిగా ఆనందరావు చెవిలో ఏదో చెప్పింది.

"అమ్మో! నావల్లకాదు. పాపం"

'పాపంలేదు పుణ్యం లేదు. అంతా మన మంచికే. మీరు కాపేపలా చూస్తుండండి.'

సౌజన్య పరంధామయ్య దగ్గరకు వెళ్ళింది.

"మామగారూ" మెమ్మదిగా తీయగా పిలిచింది.

"ఏమ్మా!"

"మందుకావాలా?" అడిగిందామె.

వద్దన్నట్లు తలూపాడు పరంధామయ్య. సౌజన్య చటుక్కున అతని ముక్కు మూసింది. ఊపిరాడకుండా గిలగిలా కొట్టుకొంటున్నాడు పరంధామయ్య.

అతని కేకలు వినిపించకుండా ఆనందరావు అతని నోరు మూసాడు.

పరంధామయ్య కళ్ళలో చివరి క్షణంలో బతుకుమీద తీపి, అది అర్థం చేసుకొనేవారికి అవగతమయ్యేది. క్షణాలు గడుస్తున్నాయి.

***

ఆనందరావు ముందు నడుస్తున్నాడు. అతని చేతిలో నిప్పులకుండ.

వెనుక చావు పల్లకీలో పరంధామయ్య.

ఆ వెనుక మిత్రులు, సన్నిహితులు.

* * *




## మృదువైన చర్మం

"ఇది ఫలానా తార రుద్దుకొనే సబ్బు— దీన్నివాడితే మీ చర్మంఎంతో మృదువుగా అయి మీరు కూడా సినిమా తారైపోతారూ"— అంటూ ఎన్నో వ్యాపార ప్రకటనల్ని మనం చూస్తూ ఉంటాం!

ఈ సబ్బుల సంగతేమోగానీ ప్రతిరోజూ శనగపిండి, నిమ్మరసం కలిపి ఒళ్ళు రుద్దుకొంటే మీ శరీరం ఖచ్చితంగా మెత్తగా, మృదువుగా అవుతుంది! మరి ఆలస్యంఎందుకు? వెంటనే ప్రయత్నించి చూడండి.

జూపిటర్